పచ్చమూకల దాడి దుర్మార్గం

విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాష్టీకం

- దళితుల మనోభావాలను దెబ్బతీశారు
- భగ్గుమన్న ప్రజానీకం

గత ప్రభుత్వ హయాంలో విజయవాడలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన భారీ అంబేడ్కర్ విగ్రహంపై పచ్చమూకలు దాడికి పాల్పడటంపై జిల్లా వాసులు భగ్గుమన్నారు. ఎన్నికల సమయంలో దళితులను వాడుకొని.. అధికారంలోకి వచ్చాక ఇలా వ్యవహరిస్తుండటంపై మండిపడుతున్నారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు ఈ ఉదంతం ఓ ఉదాహరణ అని పేర్కొంటున్నారు. కారకులపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తున్నారు.

– నెల్లూరు సిటీ / నెల్లూరు(బృందావనం) / నెల్లూరు(క్రైమ్)

ముక్తకంఠంతో ఖండించాలి



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ధ్వంసాన్ని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. పరిస్థితులు ఇలానే కొనసాగితే దళితులపై దాడులు ఎక్కువయ్యే అవకాశం ఉంది.

– గుంటక వంశీ

దళిత సమాజం నివ్వెరపోయేలా చేశారు



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు టీడీపీ నేతలు పాల్పడిన తీరుతో దళిత సమాజం నివ్వెరపోయింది. రానున్న రోజుల్లో దళితులు భయభ్రాంతులకు గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– జీవన్‌ప్రసాద్

కుట్రపూరితంగా చేశారు



టీడీపీ కుట్రలో భాగంగానే ఇది జరిగిందనే అంశం స్పష్టమవుతోంది. దళితులను ఇప్పటికే మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. దళితులు ఎదురుతిరిగే రోజు త్వరలోనే రానుంది.

– శీనయ్య, ఏపీ యానాదుల సంక్షేమ సంఘ నెల్లూరు అధ్యక్షుడు

చంద్రబాబు, లోకేశ్ ప్రోద్బలంతోనే..



సీఎం చంద్రబాబు, లోకేశ్ ప్రోద్బలంతోనే అంబేడ్కర్ విగ్రహంపై దాడులు జరిగాయి. దళితులంటే వారికి చిన్నచూపు.

– స్వర్ణ వెంకయ్య, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

దాడి అమానుషం



అంబేడ్కర్ విగ్రహంపై విజయవాడలో జరిగిన దాడి అమానుషం. ముష్కరులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ పెద్దలు బహిరంగ క్షమాపణలు చెప్పాలి. ఇలాంటి ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా తగు చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో ప్రభుత్వాలు తాత్సారం చేస్తే బడుగుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

– గడ్డం హనోక్, జాతీయ అధ్యక్షుడు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

చోద్యం చూస్తున్న పోలీసులు



రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత శోచనీయం. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. దళితులకు రాష్ట్రంలో జీవించే హక్కు లేకుండా చేసేందుకు యత్నిస్తున్నారనే విషయం అర్థమవుతోంది.

– బల్లి శరత్‌కుమార్, మాలమహానాడు నేత

రాజ్యాంగంపై దాడి



గత ప్రభుత్వ హయాంలో విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జరిగిన దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణిస్తూ ఖండిస్తున్నాం. విగ్రహంపై దాడి చేసిన వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలి.

– రాజశేఖర్ దాసరి, జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్

ఎందుకింత కక్ష..?



దళితులపై టీడీపీ నేతలకు ఎందుకింత కక్షో అర్థం కావడం లేదు. దళితులపై గతంలోనూ చంద్రబాబు ఇదే ధోరణితో వ్యవహరించారు. మరోసారి ఇదే తీరును కొనసాగిస్తున్నారు.

– పల్లాల శ్రీనివాసులు మాదిగ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు

దళితులకు రక్షణ కరువైంది



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులకు రక్షణ కరువైంది. దళితులు భయం గుప్పెట్లో బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బద్దెపూడి రవీంద్ర, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ మాజీ సభ్యుడు

సత్తా చూపుతాం



ఓట్ల కోసం దళితులను వాడుకొని.. గెలిచిన తర్వాత ఇలా వ్యవహరించడం దారుణం. రానున్న రోజుల్లో దళితుల బలమేంటో చూపుతాం. అంబేడ్కర్ విగ్రహంపై దాడిని దేశం మొత్తం ఖండించాలి.

– పాలకీర్తి రవి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు

ముస్లింలకు ధోకా

ముస్లింల పక్షపాతి అని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన టీడీపీ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకుంది. వక్ఫ్‌బోర్డు చట్టానికి సంబంధించిన సవరణ బిల్లును పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా, దీనికి ఆ పార్టీ మద్దతిచ్చింది. ఈ బిల్లుతో తమకు జరిగే అన్యాయంపై ఆ పార్టీ ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై ముస్లింలు మండిపడుతున్నారు.

– నెల్లూరు (టౌన్) / నెల్లూరు (బృందావనం) / నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు(అర్బన్) / నెల్లూరు(వీఆర్సీసెంటర్)

బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలి



వక్ఫ్ చట్టంలో మార్పులు తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి. కోట్ల విలువజేసే వక్ఫ్ భూములు, ఆస్తులను కాజేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నింది. ముస్లిం ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నాసిర్, ముతవల్లీ, మస్జీద్ – ఈ – అబీబ్

చట్టంలో మార్పులను వ్యతిరేకిస్తున్నాం



వక్ఫ్ చట్టంలో మార్పులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. సవరణ బిల్లును ప్రవేశపెట్టి వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోంది. దేశంలోని ముస్లింలు స్వేచ్ఛగా జీవించేలా చర్యలు చేపట్టాలి. వక్ఫ్ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీలోని సభ్యులు వ్యతిరేకించాలి.

– సలీమ్, వేదాయపాళెం

బిల్లు సహేతుకం కాదు



మైనార్టీలకు చెందిన విలువైన ఆస్తులను కాజేసేందుకు కేంద్రం కుటిల యత్నాలకు తెరలేపింది. వక్ఫ్ సవరణ బిల్లుతో మైనార్టీలకు చెందిన ఎంతో విలువైన ఆస్తులకు భద్రత లేకుండాపోతుంది. మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతుంది. వక్ఫ్ ఆస్తులు ఇప్పటికే అన్యాక్రాంతమైపోయాయి. వీటిని రక్షించాల్సిన ప్రభుత్వం ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. ఇది పూర్తిగా తప్పుడు బిల్లు. టీడీపీ తన మనుగడ కోసం వత్తాసు పలకడం శోచనీయం.

– ఇస్మాయిల్ ఖాద్రీ, మాజీ చైర్మన్, బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ

ముస్లింలపై వివక్ష



ముస్లింలపై మొదట్నుంచి బీజేపీ ప్రభుత్వానికి వివక్ష. ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా పాలన ఉంది. లౌకిక దేశంలో సంస్కరణ పేర్లతో కొత్త బిల్లులను ప్రవేశపెట్టం దారుణం. ముస్లింల ఆస్తుల విషయంలో గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలనే కొనసాగించాలి.

– అబ్దుల్ మస్తాన్, వెంకటేశ్వరపురం

రాజ్యాంగ విరుద్ధం



ఓ వర్గాన్ని ఇబ్బందిపెట్టేలా బిల్లులు తేవడం రాజ్యాంగ విరుద్ధం. ముస్లింలపై కక్ష సాధించేలా ఈ బిల్లు ఉంది. వక్ఫ్‌బోర్డుల విషయంలో ప్రభుత్వ తీరు తప్పు.

– సర్దార్, జనార్దన్‌రెడ్డికాలనీ

మతపర విభజన



ఈ బిల్లు లక్ష్యం మతపరంగా విభజన చేయడమే. వక్ఫ్ ఆస్తులను ముస్లింలు ఎలా పోగొట్టుకుంటారు..? ఈ తరహా రాజకీయాలు చేయడం ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ప్రజల మధ్య చిచ్చుపెట్టే ఇలాంటి బిల్లులతో దేశంలో ఐక్యత దెబ్బతింటుంది.

– అబ్దుల్ సమీ, మాజీ జిల్లా అధ్యక్షుడు, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా

చంద్రబాబు తీరు సిగ్గుచేటు



దేశంలోని మైనార్టీలకు చెందిన ఆస్తులను స్వాహా చేసేందుకు.. వారిని అణగదొక్కేందుకు కేంద్రం కుట్ర చేస్తోంది. ఈ చర్యలను చంద్రబాబు సమర్థించడం దారుణం. ఆయన తీరు సిగ్గుచేటు. దేశంలో మైనార్టీలు ఒకరనే విషయాన్ని కేంద్రం విస్మరించడం విచారకరం. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విధానాలు.. చర్యలను మైనార్టీలెవరూ మర్చిపోరు.

– ఖాలిద్, ముస్లిం యూత్ సేవా రాష్ట్ర అధ్యక్షుడు

సవరణలు తగదు



ముస్లిం మైనార్టీలకు చెందిన స్థలాలకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు చట్టంలో సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లు పెట్టాలని యత్నించడం తగదు. దీనికి టీడీపీ మద్దతు పలకడం దారుణం. మైనార్టీల ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ఆ పార్టీ ఇప్పుడు మోసం చేస్తోంది.

– రషీద్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి

దుర్మార్గం



వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టడం.. దీనికి టీడీపీ మద్దతివ్వడం దుర్మార్గం. టీడీపీ నిజస్వరూపం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. ఆ పార్టీలోని ముస్లింలు ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకోవాలి.

– ముజఫర్ అహ్మద్, నెల్లూరు

ముస్లింల పక్షపాతి వైఎస్సార్‌సీపీ



ముస్లింల సంక్షేమానికి నాలుగు శాతం రిజర్వేషన్లను దివంగత సీఎం వైఎస్సార్ కల్పించారు. మొదట్నుంచి ముస్లింల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో చర్యలు చేపట్టింది. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లును పార్టీ వ్యతిరేకించింది.

– అమానుల్లా, నెల్లూరు

కూటమి నుంచి టీడీపీ బయటకు రావాలి



ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలంటే టీడీపీకి అసలు పడదు. ఇప్పుడు దాని అసలు రూపం బయటపడింది. వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు బీజేపీకి మద్దతివ్వడం దారుణం. ఇప్పటికైనా కూటమి నుంచి టీడీపీ బయటకు రావాలి.

– అన్సర్

మంత్రులకు అర్జీల వెల్లువ

నెల్లూరు(దర్గామిట్ట): నగరానికి సంబంధించిన సమస్యల పరిష్కార నిమిత్తం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో అర్జీలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం స్వీకరించారు. ప్రజలు భారీగా తరలివచ్చి వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, కమిషనర్ సూర్యతేజ, ఎస్పీ కృష్ణకాంత్, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మితారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, డీఈఓ రామారావు, సీపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

- చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని జనసేన నేత గునుకుల కిశోర్ కోరారు.
- పది వేల మందికిపైగా ముస్లింలున్న కొత్తూరులో ఈద్గా సమస్యను పరిష్కరించాలని ఈద్గా కమిటీ సభ్యుడు, మైనార్టీ నేత ఆషిక్ అలీఖాన్ వినతిపత్రం అందజేశారు.
- కొడవలూరులో ఐదెకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని టీడీపీ ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.
- ఫ్లైఓవర్ కారణంగా తొలగించిన ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని యాలమూరి రంగయ్యనాయుడు వినతిపత్రం సమర్పించారు.
- రైతులను మోసం చేసి ధాన్యాన్ని అపహరించిన వారిపై చర్యలు చేపట్టాలని సీపీఐ నేతలు కోరారు.
- నగరంలోని ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలను ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకొని దానిపై గృహాలను నిర్మిస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని సీపీఐ నేత వాటంబేటి నాగేంద్ర కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు.
- సిరిటుడే గోల్డ్ ఆగ్రోఫామ్ లిమిటెడ్ కంపెనీ ప్రజల నుంచి డబ్బులను వసూలు చేసి బోర్డు తిప్పేసిందని, బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం



రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో జగన్మాతకు విశేష పూజలను నిర్వహించారు. నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. సామూహిక లక్ష కుంకుమార్చనను జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామశర్మ, వేదపారాయణదారుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

- సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతామహాలక్ష్మికి సామూహిక కుంకుమపూజ, పల్లకిసేవను నిర్వహించారు. అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.
- వేదాయపాళెం మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో వైభవలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు.
- సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో మూలవర్లు, స్వర్ణమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, శ్రీచక్రార్చనలు, ఉత్సవమూర్తులకు రజత కలశంతో క్షీరాభిషేకం తదితరాలను నిర్వహించారు. మందిర కమిటీ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.
- ఏసీనగర్ కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ, కలశపూజ, హోమాన్ని నిర్వహించారు. అమ్మవారు పసుపు, కుంకుమ అలంకారంలో కటాక్షించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకటరమణయ్య, సరిత దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ చైర్మన్ పత్తి నరసింహులు, సభ్యులు గోవిందరాజులు, వీరరాఘవులు, చంద్రారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారికి అభిషేకం, పల్లకిసేవ, గరుడసేవ, గిరి ప్రదక్షిణను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా రామకృష్ణరావు కుటుంబసభ్యులు, సతీష్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ఎలక్ట్రిసిటీ ముస్లిం మైనార్టీ అసోసియేషన్, నెల్లూరు రూరల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కోటమిట్టలోని ఎస్సార్బీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అల్తాఫ్ హాజరయ్యారు. అసోసియేషన్ నెల్లూరు రూరల్ అధ్యక్షులుగా జమీలస్, సెక్రటరీగా నజీర్ అహ్మద్, జాయింట్ సెక్రటరీగా హఫీజ్, ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్ అహ్మద్, ట్రెజరర్‌గా వజీర్‌బేగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీ నవాబ్‌జానీ, రీజినల్ సెక్రటరీ రఫీ, కోటమిట్ట ఏఈ నస్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ఆదివారం అందజేయనున్నామని గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్ పేర్కొన్నారు. సుజాతమ్మ కాలనీలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కోసూరు రాజశేఖర్, తాతా రమణయ్య, సుబ్బారావు, హరి, రాజా, వెంకటేశ్వర్లు, చిన గోవిందయ్య, శ్రీనివాసులు, దశయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశానికి ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): మంత్రి నారాయణను నగరంలోని ఆయన నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జెడ్పీ సమావేశానికి రావాలంటూ మంత్రిని ఆహ్వానించారు. నారాయణ విద్యాసంస్థల జీఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): నవాబుపేట, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్లుగా అన్వర్‌బాషా, రోశయ్యతో పాటు వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బారావు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. వీరికి ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని వీరు మర్యాదపూర్వకంగా కలిశారు.

డీవైఎఫ్ఐ నేతల నిరసన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రెజ్లర్ వినేష్ ఫోగట్‌కు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు గాంధీబొమ్మ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై కూర్చొని నిరసనను శుక్రవారం చేపట్టారు. నగర కమిటీ సభ్యులు గణేష్, రాజేష్, సుబ్బరాయుడు, చిన్నపవన్, సురేంద్ర, అహ్మద్, సాజిద్, లోకేష్, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(అర్బన్): వైద్య శాఖలో కొందరు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ హంస అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని పెద్దాస్పత్రికి శుక్రవారం వచ్చిన వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్, మహిళా విభాగ గౌరవాధ్యక్షురాలు ఇందిర, నేతలు పరిమళ, మజరుల్లా, గౌస్‌బాషా, ఉమా, ధనలక్ష్మి, పృథ్వి, బ్రహ్మేశ్వరి, మాధవ, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ట్రంక్‌రోడ్డులోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, తిరుపతమ్మ, శ్రీవత్సల, పినాకపాణి, లోకేష్‌బాబు, జావీద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జీజీహెచ్‌లో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రాన్ని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్ శుక్రవారం అందజేశారు. ఆస్పత్రిలో అన్యాయాలు, అక్రమాలకు కారకులైన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

బోరు ఏర్పాటు

నెల్లూరు (లీగల్): నగరంలోని వేద సంస్కృత పాఠశాలలో నీటి సదుపాయాన్ని కల్పించేందుకు గానూ బోరును ఏర్పాటు చేశారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మూడో అదనపు జిల్లా జడ్జి తేజోవతి హాజరయ్యారు. మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ జవాల్‌మాల్ జైన్, వైస్ ప్రెసిడెంట్ చంపాలాల్ జైన్, సభ్యులు ప్రకాష్ జైన్, అశోక్ జైన్, సురేష్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, వాణిజ్య భవనాల పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు నుంచే రాజకీయ జీవితం ప్రారంభం

నెల్లూరు(బారకాసు): సింహపురి నుంచే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని.. తానెన్నో విషయాలను ఇక్కడే నేర్చుకున్నానని.. ఇక్కడికి వస్తుంటే పుట్టింటికి వచ్చినంత ఆనందంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. మంత్రి పదవి చేపట్టాక నెల్లూరు విచ్చేసిన సత్యకుమార్‌కు నగరంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కిలారి తిరుపతినాయుడు కల్యాణమండపంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కందికట్ల రాజేశ్వరి, సురేంద్రరెడ్డి, విల్సన్, శ్రీనివాసులు, కందుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తాం

నెల్లూరు సిటీ: ఆధార్, రేషన్ కార్డులు, పింఛన్ రాని వారు తమకు అర్జీని అందజేస్తే, సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుమూడి దళితవాడలో వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐదో అదనపు జిల్లా జడ్జి సరస్వతి, డిస్ట్రిక్ట్ సర్వైలెన్స్ ఆఫీసర్ భాస్కర్, మెడికల్ ఆఫీసర్ అర్షద్ హుస్సేన్, సీఐ మారుతికృష్ణ, సర్పంచ్ కరుణాకర్ పాల్గొన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

నెల్లూరు(బృందావనం): పాస్టర్ల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవరెండ్ కూరపాటి విజయకుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏసురత్నం, జాతీయ సమన్వయకర్త జయప్రకాష్ పేర్కొన్నారు. నగరంలోని చర్చి ఆఫ్ క్రైస్ట్‌లో వీరిని అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గడ్డం హనోక్, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రాజు, కోశాధికారి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, సభ్యులు ఎనోష్, సునీల్ పాల్గొన్నారు.